రవ్యకి ప్రాణాలు తోడేస్తున్నంత బాధగా ఉంది. మనసంతా కందిరీగల్లా ప్రశ్నలు ముసురుకుంటున్నాయి. ఇలా తమకే ఎందుకు జరిగింది? తమ సంగతి సరే, చిన్నారి స్మిత! అదేం తప్పు చేసింది? తనకెందుకీ శిక్ష?

తనకేం జరిగిందో తనకే అర్థంకాక మంచానికంటుకుపోయిన ఏడేళ్ల పసిదాన్ని చూస్తే కడుపులో మంట పెట్టినట్టుందామెకి. ఎక్కడికి వెళ్తుంది, మన సంస్కృతి? సంఘం? ఆడుతూ పాడుతూ బడికెళ్లి వస్తున్న చిన్న పాపాయిని చెరచే పశువులు సంఘంలో ఘరానాగా ఎలా మనుషుల ముసుగు తొడుక్కుని తిరుగుతున్నాయి? వారిని మిగతా నాగరికులు ఎలా భరిస్తున్నారు? ఒక్కసారి నరకం అంచు వరకూ వెళ్లి తిరిగొచ్చి, అమ్మ కుచ్చిళ్లలో తల దాచుకుని భయంతో వణికిపోతున్న స్మితని ఏ న్యాయస్థానం, ఏ చట్టం రక్షించగలవు?

భగవంతుడా! కణతలు నొక్కుకుంది. తను నిద్రపోయి ఎన్ని రోజులవుతుంది? ఇప్పుడసలేం చేయాలి?

భర్త శేఖరం కూడా మతిపోయిన వాడిలా తిరుగుతున్నాడు. స్నేహితుడు, శ్రేయోభిలాషి రవి మాత్రం ధైర్యం చెబుతున్నాడు. స్మిత భవిష్యత్తేమిటి? అదసలెప్పటికైనా మామూలుగా ఆడుతూ పాడుతూ లేస్తుందా? దాని శరీరానికీ, మనసుకీ అయిన ఈ గాయం ఎప్పటికి మానేను?


ఇప్పుడు స్నేహితులూ, బంధువులూ జాలీ, దయా చూపించేవారే! కానీ అది పెద్దయ్యాక వీళ్లే ఎలా ప్రవర్తిస్తారో? దానికైన దారుణ అనుభవం గురించి తెలిసి దానినాదరిస్తారో, విదిలిస్తారో! ఎలా నా చిట్టితల్లి ఈ మనుషుల మధ్య నెగ్గుకొస్తుందో! పోనీ, ఈ ఊరొదిలి ఏదైనా దూర ప్రాంతానికి బదిలీ చేయించుకుని వెళ్లిపోతే.

ఇన్‌స్పెక్టర్ రవి, ఎలాగైనా నేరస్తుడికి శిక్ష వేయించాలని పట్టుదలగా ఉన్నాడు. పర్వర్టెడ్ ఫీడోఫైల్స్ చేసులో తిరిగే దున్నపోతుల్లాంటివారినీ, వారిని సంఘం, పోలీసులూ తరిమి తరిమి కొట్టాలనీ, తనకూ తెలుసు.

కానీ, ఈ కేసులో పడి తిరిగితే, దాని భవిష్యత్తు మాటేమిటి? వాళ్లు ఎన్ని అడిగే

# శిక్ష

శారద



సూటీపోటీ ప్రశ్నలకు అదేం జవాబు చెప్పగలదు? తను మాన్పించాలనుకుంటున్న గాయం, వచ్చి పుండులా దాన్ని చిత్రవధ చేయదూ? కోర్టు కేసులు తేలటానికి బోలెడు సంవత్సరాలు పట్టొచ్చు. అసలే అస్థిమితంగా, అనిశ్చితంగా అయిన దాని జీవితం ఇంకా ముళ్ల కంచెల్లోకి నెట్టాలా? ఈ కోర్టులూ, కేసులూ ఏమీ వద్దు. ఈ ఊరొదిలి వెళ్లటమే మంచిది.

కానీ, అందరూ తనలాగే ఆలోచించి తప్పుకుంటే, నేరస్తులు ఇంకా రెచ్చిపోరూ తమ భయమే వారికి కవచం కాదూ? తన బిడ్డ బతుకు పాడైపోయిందని, ఇలాంటి పశువులని వీధులవెంట తిరగనిస్తే, మిగతా బిడ్డల మాటేమిటి? వాళ్లూ తన పిల్లలాటి వాళ్లు కారూ? చదువుకుని, సంస్కారవంతులైన వారూ, బాధ్యత తెలిసినవారూ అయిన తామే చట్టానికీ, న్యాయవ్యవస్థకీ సహకరించకపోతే, ఇక మామూలు జనం మాటేమిటి?

తలుపు తోసుకుని లోపలికొచ్చాడు శేఖరం. ఇద్దరూ మౌనంగా భోజనం ముగించి లేచారు.

స్కూల్నించి ఇంటికి తిరిగొస్తున్న తమ చిన్నారిని చాక్లెట్లిస్తానని సైకిలెక్కించుకుని తీసికెళ్లి అత్యాచారం చేసిన రాజేష్‌ని వీలైతే ముక్కల కింద నరికేయాలనుంది శేఖరానికి.

రమ్యకి ఇదంతా ఒక పీడకలగా మారిపోయి, తను మేలుకుంటే బాగుండునని వుంది.

స్మిత అసలు కళ్లే తెరవకుండా, ఎప్పటికీ చీకట్లోనే వడుకుంటే బాగుండునని వుంది.

***

నిప్పులు కక్కుతున్న పొయ్యిమీద కూర్చున్నట్టుంది సుభద్రకి. ఎక్కడ పొరపాటు చేసింది తను? ఏమిటి తన పెంపకంలో లోపం? వాడే తన కలల పంట, నోముల ఫలం అనుకుంది. పాలల్లో విషం చిలకరించినట్టు ఇలా జరిగిందేమిటి?

బి.ఎస్సీ. చదువుతున్నాడు. ఇంకా చదువుతాడు వాణ్ణి చూసి తను గర్వపడే రోజు వస్తుందనుకుంది. శేఖరం దంపతులు వాడిపై పోలీస్ రిపోర్టు ఫైల్ చేస్తారేమోనని క్లయింట్ రామారావు వచ్చి చెప్పకపోతే అసలు తనకీ సంగతే తెలిసేది కాదు.

కాలేజీకి ఇల్లు దూరంగా వుంది. అక్కడే దగ్గర్లో రూం తీసుకుని వుంటానంటే, వాడు చదువుకోవడానికి వీలుగా వుంటుందని సరేనన్నారు. కానీ ఆ రూంలో వాడు ఏడేళ్ల పసిపాపని తీసుకొచ్చి.... ఊహే కంపరంగా అనిపించి తలవిదిలించుకుంది. తను విన్నది తప్పేమో అనుకుంది మొదట. కానీ ఆ పావ తల్లిదండ్రులు తప్పుడు కేసెందుకు వేయాలనుకుంటారు?

రాత్రి ఈ విషయం వినగానే, ఆయన వాణ్ణి పిలిచి అడిగారు- "ఇది నిజమేనా?" అని. వాడి మౌనంతోనే అర్థమైంది నిజమేమిటో. వాణ్ణి ఆ చెంపా, ఈ చెంపా వాయించి జుట్టు పట్టుకుని ఊడ్చుకెళ్తారనుకుంది.

"నువ్వా అమ్మాయిని సైకిలెక్కించుకుని తీసికెళ్లటం ఎవరైనా చూశారా?" ఆయన ప్రశ్న విని నివ్వెరపోయింది. ఇప్పుడు సాక్ష్యాధారాలతో ఏం వని?

"సరే నువ్వెళ్లు, నేను చూస్తాలే. ఏం చేయాలో?" అంటూ తన ఆఫీసు గదిలోకెళ్లిపోయారాయన.

తన పెంపకంలో వాడు ఏడేళ్ల వసిపావను ఆడదనే దృష్టితో చూడటం ఎలా నేర్చుకున్నాడు? ఇప్పుడేం చేయాలి? కొడుకు భవిష్యత్తు కోసం బాధపడాలో, నిర్దాక్షిణ్యంగా నలిగిపోయిన పాప భవిష్యత్తు గురించి బాధపడాలో, ఏదీ అర్థం కాలేదామెకు. ఊహించలేనంతటి ఘోరమైన నేరం చేసిన కొడుకు కోసం తను ఇంతగా బాధపడుతుంటే, ఏ తప్పూచేయని పాపకోసం వాళ్లెంత క్షోభ పడుతున్నారో కదా, అనిపించిందొక్క క్షణం.

***

"నమస్తే."

తలుపు తీసిన రమ్య ప్రశ్నార్థకంగా చూసిందామె వైపు.

"మీరు..."

"నేను 'స్త్రీ శక్తి'నుంచొస్తున్నాను. మిమ్మల్ని, మీ అమ్మాయిని ఒకసారి కలవమని రవి చెప్పారు" తనెవరో నిజం చెబితే ఎలా రియాక్టవుతుందోనని భయపడింది సుభద్ర.

మౌనంగా లోపలికి దారితీసింది రమ్య. ఆమె ముభావాన్ని సరిగ్గానే అర్థంచేసుకుంది, సుభద్ర.



## కల నిజమయ్యేనా?

**ద**క్షిణాది నటి రేవతి దర్శకత్వం వహించిన 'మిత్ర్-మై ఫ్రెండ్' చిత్రంలో చేసిన శోభనకు జాతీయ అవార్డు లభించిన సంగతి అందరికీ తెలిసిందే. ఇప్పుడు రేవతి దర్శకత్వం వహించిన 'ఫిర్ మిలేంగే' చిత్రంలో పొడుగు కాళ్ల సుందరి శిల్పాశెట్టి చేస్తున్నది. శోభనకు ఎలా జాతీయ అవార్డు వచ్చిందో, అలాగే రేవతి చిత్రంలో చేసే తనకూ వస్తుందనే ఆశతో కలలు కంటున్నదిట శిల్ప. చూద్దాం, వస్తుందో, రాదో!

"చూడండి! నేను మిమ్మల్ని బాధపెట్టి, మాటలతో మీ గాయాల్ని కెలకటానికి రాలేదు. ఒక ఎమోషనల్ ట్రౌమాలో వున్న మీకు, స్మితకూ కౌన్సిలింగ్ ద్వారా సహాయం చేయటానికొచ్చాను. మీకు మాట్లాడటం ఇష్టం లేకపోతే నేను వెళ్లిపోతాను. కానీ కొన్నిసార్లు మాటల వల్లే మనసులో కరడు కట్టిన బాధ కరిగిపోతుంది."

"ఏం మాట్లాడమంటారు?"

"ఏదైనా సరే. మీ గురించి, మామూలుగా ఒక స్నేహితురాలితో చెప్పినట్టు చెప్పండి."

కొద్దిసేపు కబుర్లు, కాఫీ తర్వాత మెల్లిగా మనసు విప్పింది రమ్య. పక్కవీధిలో వుంటాడు రాజేష్. లెక్కలవీ చెప్పించుకోవటానికొస్తూ ఉంటాడు. రెండు మూడు నెలల్లో వారికి బాగా చేరువయ్యాడు. కిందటి వారం ఒకరోజు స్మిత ఇంటికొస్తుంటే ఎదురొచ్చి, చాక్లెట్లిస్తాను రమ్మని తీసికెళ్లాడు. ఎప్పుడూ ఇంట్లో కనవడుతుండే వ్యక్తి కావడంతో భయం లేకుండా అతని వెంట వెళ్లింది స్మిత. ఆపైన చెప్పలేకపోయింది రమ్య.

మీ బాధ నాకర్థమైంది. తప్పక వాడికి శిక్ష వడుతుంది. రవి మీ కేసులో చాలా పట్టుగా

వున్నాడు. ఎట్టి పరిస్థితిలోనూ వాణ్ణి వదలనని అన్నాడు నాతో."

"ఏమో! అదే నేనూ తేల్చుకోలేకుండా వున్నాను. అసలీ కేసునించి తప్పుకుని ఎక్కడికైనా వెళ్లిపోదామా అనిపిస్తుంది మాకు."

"మీ పరిస్థితుల్లో అలా అనిపించడం చాలా సహజం. కానీ ప్రమాదకరమైన వ్యక్తుల్ని పట్టుకుని చట్టానికి అవ్పగించడం మనందరి బాధ్యత. కొంచెం మనసుకి కష్టంగా వున్నా, కనీసం ఒక్కళ్లకైనా బుద్ధి చెప్పామంటే..."

"కొంచెం కష్టమా? కోర్టులో చిన్న పిల్లనైనా చూడకుండా వాళ్లు వేసే ప్రశ్నలకి స్మిత ఎలా జవాబు చెబుతుంది? అసలా కేసు తేలటాని కెన్నేళ్లు పడుతుందో ఏమో? వ్యక్తులైన స్త్రీలే మానభంగం కేసుల్లో కోర్టుకెక్కటానికి భయపడుతున్నారు. అటువంటింది నేను నా చిన్నారి తల్లిని ఆ తోడేళ్ల ముందు పడేయనా?" కోపంగా అడిగింది రమ్య.

"మీరన్నది నిజమే. కానీ అందరూ మీలాగే ఆలోచించి కోర్టులకీ, కేసులకీ జడిస్తే సంఘంలో నేరస్తుల పని సులువైపోదూ?"

"ఈ సంఘాన్నీ న్యాయవ్యవస్థనీ పనికట్టుకుని మార్చేంత తీరికా, ఓపికా నాకు లేవు. నాకు నా బిడ్డ భవిష్యత్తు మాత్రమే ముఖ్యం. దాని సంతోషం, సెక్యూరిటీకంటే నాకింకేవీ ముఖ్యం కావు. ఈ విషయం పదిమంది నోళ్లలో నానితే, అది పెద్దదైనా, దాన్ని ఆ నీడలు వదిలిపెట్టవు. అంతకంటే, ఎక్కడికైనా దూరంగా వెళ్లిపోయి, ఈ ప్రస్తావన దాని ముందు రాకుండా వుంటే, అదెప్పటికైనా కోలుకుని అందరిలా బ్రతుకుతుంది."

ఆమె డైలమానీ, క్షోభనీ అర్థం చేసుకుంది సుభద్ర.

"మీకెప్పుడే సాయం కావాల్సొచ్చినా, ఈ నెంబరుకి ఫోన్ చేయండి" ఆఫీసు నెంబరిచ్చింది.

***

రాత్రి భోంచేస్తూ అడిగింది భర్త శ్యామ్రావుని, సుభద్ర- "రాజేష్ భవిష్యత్తు గురించి ఏమాలోచించారు?"

"నువ్వేం భయపడొద్దు. వాడికి శిక్షపడకుండా చూసే బాధ్యత నాది."

అసలు తన భయం, వాడికి శిక్ష పడదేమోనని! తన ఆరాటం చెడుదారిలో నడుస్తున్న వాడి భవిష్యత్తెలాగుంటుందోనని. ఆ సంగతి భర్తకి అర్థం అయినట్టు లేదు. ఆయన తన ప్రశ్నని వేరే రకంగా అర్థం చేసుకున్నారని తెలిసినా, దాని గురించేం మాట్లాడకుండా అడిగింది-




"శిక్ష పడకుండా ఎలా చూస్తారు?"

"నేనా విషయం ఎప్పుడో ఆలోచించాను. ఇలాటి కేసుల్లో విక్టిమ్‌ని కోర్టుకు రాకుండా భయపెట్టొచ్చు. చిన్నపిల్ల కాబట్టి అసలు వాళ్లే పంపరు కూడా. ఒకవేళ కోర్టుకొస్తే, విక్టిమ్ శీలవతి కాదనీ, సత్ప్రవర్తన లేనిదనీ నిరూపిస్తే చాలు. కోర్టులో కేసు తేలిపోతుంది."

చిన్నపిల్ల ప్రవర్తన మంచిది కాదని ఋజువు చేస్తారా? ఎలా? ఆమె మెదడు ఆలోచించడం మానేసింది.

"వెరీ సింపుల్. చాక్లెటిస్తానని మనవాడన్నాట్ట. అలా అంటే వెళ్లిపోవడమేనా? అంటే ప్రవర్తన మంచిది కానట్టే కదా!"

ఆమెకి తన జీవితంలో వున్న ఇద్దరు మగవాళ్లమీదా, వాళ్లతో సహజీవనం చేసిన తనమీదా అసహ్యం ముంచుకొచ్చింది. కడుపులో దేవినట్టయింది.

భర్త లాయరుగా నీతి కతీతంగా డబ్బు సంపాదించడం నచ్చకపోయినా, సంప్రదాయాన్ని కాదనే తెగింపు లేక సరిపెట్టుకుంది. కొడుకు పాపానికి ప్రాయశ్చితంగా అభం శుభం ఎరుగని పాపాయిని చెరచటం, భర్త దాన్ని సమర్థించడం ఏ మాత్రం సహించలేకపోయింది.

సూట్‌కేస్‌తో సహా బయటికొచ్చిన ఆమెను ఆశ్చర్యంగా చూశారు తండ్రీకొడుకులు.

"ఎక్కడికి ఇంత అకస్మాత్తుగా ప్రయాణం?"

"ఈ ఇంటినుంచి ఎక్కడికైనా దూరంగా! మీ మొహం చూడటానికే నాకసహ్యంగా వుంది. మీతో కలిసి బతికితే, నన్ను నేను క్షమించుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది."

పసి పాపలు పూమొగ్గల్లాటి వాళ్లు. వాళ్లని ఎత్తుకుని ప్రేమగా ముద్దాడుతాం. పశువుల్లా తొక్కి నాశనం చెయ్యం. మదమెక్కిన పశువులాంటి వాణ్ణీ, వాణ్ణి వెనకేసుకొచ్చి, చిన్న పిల్ల జీవితాన్ని కోర్టులో గెలవాల్సిన కేసులా చూస్తున్న మిమ్మల్ని నరికి పోగులు పెట్టినా పాపం లేదు. మీరిద్దరూ సమాజానికి పట్టిన చీడపురుగులు.

"శేఖరం దంపతులు మీమీద కేసు వేయరు. బహుశా, మీకే కోర్టూ శిక్ష వేయదు. కానీ నేను వేసే శిక్షనుంచి మీరు తప్పించుకోలేరు. నేను, మీతో పరిచయం ఉన్న వాళ్లందరికీ, స్నేహితులూ బంధువులూ అందరికీ, వాడికి పట్టిన మానసిక జాడ్యం గురించి చెబుతాను. మిమ్మల్ని నలుగుర్లో తలెత్తుకోకుండా చేస్తాను. పదిమందితో మిమ్మల్ని ఛీ అనిపిస్తాను.

ఇలాంటి కొడుకును కన్నందుకూ, వాణ్ణి సరైన దారిలో పెట్టనందుకూ, పరిహారంగా నేను వాడి మొహం ఈ జన్మలో చూడను."

తలుపు తెరిచి ముందున్న చీకట్లోకి ఏ మాత్రమూ భయపడకుండా నడిచింది సుభద్ర.

■